# సావిత్రి స్వగతం

ప్రశాంతంగా మానవసంచారమే లేని నిట్ట మధ్యాహ్నం వేళప్పుడు, గాలికి కదలాడే నీడలను దాటుకుంటూ, ఎవరికంటా పడకుండా మా పెద్ద భవనపు పెరటి పక్కకి చేరుకోవాలి. అక్కడే విశాలమైన నూతిచప్టామీద కూర్చుని సూర్యుడు కృంగేదాకా, నీడలు సాగిసాగి పొడుగయ్యేదాకా గడచిన ఘట్టాలని నెమరు వేసుకుంటూ కూర్చోవాలి. తరువాత? తరువాత యేం జరుగుతుందో తల్చుకుంటే నవ్వొస్తుంది. భయమేస్తుంది. అదేమిటో, సాయంత్రం వేళ అనవసరంగా అన్ని పక్షులూ అంత గోడవచేస్తాయి! యిళ్ళకి వెళ్ళే హడావిడిలోనా? యింటికి వెళ్ళటందుకు అసహ్యం చేతనా? ఈ పెద్ద గందరగోళం యీ పక్షిలోకంలో? చిన్న పిల్లల్లా–యింట్లోకి పోయేముందు అమ్మ అదిలించి పక్కలోకి చేర్చేసేముందు యింకొక్క ఆట ఆడాలన్నట్లు–ఏమిటో పెద్ద గందరగోళం! సూర్యుడు పూర్తిగా అస్తమించేయడంతో అంతా మళ్ళీ నిశ్శబ్దం. ఇంట్లోకి వెళ్ళాలి... ఎప్పుడూ ఇంతే–యీ నూతి చప్టామీద ప్రశాతంగా కూర్చోవచ్చు. కాని ఏకాంతంగా మటుకు వుండలేను. జ్ఞాపకాల సహచర్యం ఎప్పుడూ వుంటుంది. కాని యింట్లోకి వెళ్ళాలి. ఆయనకి మందు యిచ్చే టైమయింది. ఈ పల్లెపట్టులో యెంతో అందంగా ప్రశాంతంగావుండే స్థలాలనేకం వున్నాయి. కాని మా పెరట్లోని ఈ నూతి చప్టా, పక్కనే బాదం చెట్టూ ఉన్నంత బాగా నాకింకేదీ బాగుండదు.

కొంచెం ఎత్తుగా వుండి నూతిచప్టా బాగుంటుంది. ఆయన చెప్పినట్లు అక్కడ కూర్చుంటే ఆలోచనలు కట్లు తెగి ప్రవహిస్తాయి. హృదయాంతరాళాలలోంచి కవిత్వం పుట్టుకొస్తుంది. సర్వ ప్రపంచంమీందా, ఆదరణా, ప్రేమా, అభిమానం పుట్టుకొస్తాయి. ఆయన అన్నట్లు కాకపోయినా నాకు యిదో కోరుకోతగ్గ స్థలంగానే తోస్తుంది. ఈ పల్లెపట్టు వదలి పధ్నాలుగు సంవత్సరాలుపాటు పెద్ద పట్టణాలూ, వింత వినోదాలు తిలకించి, అనుభవించి వచ్చిన నాకు యిదో కోరుకోతగ్గస్థలంగానే అనిపిస్తుంది. అందుకే క్షణం అవకాశం చిక్కినా యీ నూతి చప్టామీద, బాదంచెట్టున పండిన ఆకులని లెక్కపెట్టడానికి ప్రయత్నిస్తూ కూర్చుంటాను.

ఆయన మంచివాడు. ఆదర్శాలతో ఆకాశాన్ని అందుకోవాలని అనుకోవడం బాగానే వుంటుంది. కాని దానికి ఓ ప్రత్యేకత, యిదీ నా పద్ధతి అని చెప్పకొనే ధీమా లేకుంటే బాధ. ఏదో సృష్టిద్దాం అన్న కోరికా, ఆ కోరికను ఫలింపచేసుకొందుకు అశక్తతా—మరీ బాధాకరం. ఆయన సుగుణాలరాసి. కాని అన్ని సుగుణాలు ఎలాగ భరించడం? ఆయన తాగడు. ఆడవాళ్ళంటే అభిమానించడు, పేచీలు తెచ్చుకోడు—మోసగించలేడు, అవిశ్వాసం ప్రకటించలేడు, మోటుగా ప్రవర్తించలేడు. యిది నాదీ అని స్వార్థానికి కోరుకోలేడు. ఏదీ చెయ్యలేడు. నాకు పదహేడేళ్ళప్పుడు నాన్న యీాయన్ని నాకోసం చూశాడు. ఆనాడు యీ సుగుణాలన్నీ నాకెంతో అభిమానపాత్రంఅయాయి. వాటిని చూసి నేనెంతో గౌరవించాను. ప్రేమించాను. కొన్ని సంవ

త్సరాలపాటు వాటన్నిటినీ ప్రేమించాను. కాని తరవాత తర వాత తోచేది నే నెందు కీ పెళ్ళికిట్టే ఒప్పేసుకున్నా నా అని! కాని కారణాలు యిట్టే దొరికాయి: నాన్నహయాం తప్పి పోతే చాలనిపించింది ఆ రోజులలో. ఆ వయస్సులో ఏమైనా చెయ్యవచ్చు కాని ఒకరు చెప్పిన మాట వినడంఅన్నది కష్ట తరంగా తోచేది. అందుకే పెళ్ళికి ఒప్పేసుకున్నాను. ఆయ నతో పెళ్ళంటే హాయిగా గాలిలా బతికేయడం. అది తెలిసే ఒప్పేసుకున్నాను. ఆయనతో పాటు మా యీ పెరట్లో ఎన్నెన్ని ప్రశాంత సాయంత్రాలు గడిపానో... పక్కనించి పోయే మేకలూ పిల్లలూ, మా పెంపుడు కుక్క, దాని అగ డజను పిల్లలూ. ఎక్కడ చూసినా ప్రకృతి నిండుగావుండి నన్ను బాధపెట్టేది. నా కెందుకు లేదు యీ నిండుతనం? నా కెందుకురాదు మాతృస్థానం? అని కనబడని దేవుళ్ళని అడుగుతూ, ఏకాంతంలో వాపోయేదాన్ని.

కాని అదంతా యిప్పుడు తలుచుకుంటే నవ్వొస్తుంది, నన్నుచూసీ ఆయనని చూసీ కూడా. కాకుంటే ఏమిటి? నన్ను నేనే ఒక్కసారి చూసుకుంటే! నే అందించే రూపు చూస్తే, నలభయ్యో పడిలో పడ్డాను. ఎటొచ్చీ చిన్నతనం నుంచీ దృఢమైన శరీరం అవడంచేతా, చక్కటి పోషణవల్లా కాని, నలభైవొచ్చేసరికి ఇంకేముంది ఆడదానిలో?

యిలా కూర్చున్నప్పుడు నన్ను నేనే ప్రశ్నించు కుంటూ వుంటాను: నేను ముసలిదాన్ని అయిపోయాను అంటే ఏమిటి? ముసలి ఆడదంటే ఏమిటి? నేనెవరు? ముసలి దాన్నే కాని పాతదాన్నే. నాలో యిమిడిపోయి చిన్నతనపు

నేను, ఐశ్వర్యవంతుని కూతురుగా, ఐశ్వర్యపుటొడిలో పెరిగి పెద్దదాన్నయిన నేను, పతికి అన్ని సేవలూ చేసే ఆదర్శవంత మైన భార్యగా నేను, అంతేకాదు; పతితనయిపోయిన నేను, వినోదంకోసం. అసంతృప్తిచే నిద్రించని కోర్కెల సఫలత కోసం లేచిపోయిన, (ఎవరితో, ఎందుకూ పనికిరాని వాడితో, రౌడీతో లేచిపోయి) పతితనైన నేను, దారుణంగా సాంప్రదాయపు కట్లు తెంచుకొన్న నేను, యిప్పుడు పశ్చాత్తాపంతో, దహించుకుపోయే హృదయం నూతి చప్టాను ప్రేమించే నేనూ - అన్నీ నాలో యిమిడిపోయే వున్నాయి. అసలు వృధాప్యం క్షణంలో వస్తుందా, నా పిచ్చి గాని! ఎన్నెని జీవనరంగాలు దాటేక, వాటివాటి ఫలితాలు యీ శరీరంలో గుర్తింపబడ్డాక, ఎన్నాళ్ళకి, ఎన్నాళ్ళ కూడికగానో వస్తుంది వృద్ధాప్యం. యిన్నాళ్ళ తరువాతకూడా వెంకటేశ్వర్లుతో దేశాలు తిరుగుతూ గడిపిన దినాలూ, అసలీపట్లెనే పూర్తిగా మరిచి, యీ యింటినీ యీాయన్నీ కూడ మరిచి గడిపిన దినాలూ, జ్ఞాపకాలుగా వెన్నంటి వుంటూనే వున్నాయి. వలభయ్యో పడిలోపడ్డ నేను కృష్ణా రామా అనుకోకుండా జ్ఞాపకాల బాధనుండి తప్పించుకునే తాపత్రయంలో మునిగిపోయాను...అవును వెంకటేశ్వర్లుని ఓ పట్టాన మరిచిపోవడం ఎలాగ! నాలో కోర్కెలను రేపి నా జీవితంలో సుఖాయాసంగా పద్నాల్గు సంవత్సరాలని దాచుకోకల్గిన వెంకటేశ్వర్లుని మరిచిపోవడం ఎలాగ?... అంతగా నన్ను ప్రేమించి లాలించిన వెంకటేశానికే ఎంతటి దైవభక్తీ, నీతివంతులంటే పూజ్యభావమూ వుండేవి! ఎంతో

సంతోషంతో సర్వం మరచి, విశాలమైన అతని గుండెలమీద తలనాన్చి పడుకునివున్న సందర్భంలో—"చూడు సావిత్రీ, నిన్ను లేవతీసుకొచ్చినందుకు నన్ను దేవుడు క్షమించడు; అందరూ నిన్ను పతిత అంటారు. అప్పుడు నీకెలా వుంటుంది?" అని అడిగేవాడు. అప్పుడు అనిపించేది-లోకం ఏమనుకుంటే నాకేం, వెంకటేశ్వర్లు నావాడు, వెంకటేశ్వరులచేతుల్లో జీవితం వెళ్ళిపోతే చాలు అని. కాని అన్నీ మనం అనుకున్నట్లే జరుగుతాయా?—పధ్నాలుగేళ్లు, ఎవరూ ఏ అగ్ని సాక్షిగా వివాహంచేసుకొన్న భార్యనూ ఆదరించని రీతిగా, అభిమానించని రీతిగా నన్ను ఆదరించాడు, అభిమానించాడు. భార్యమీద వుండే అధికారం ప్రియురాలి కనుసన్నలలో మెలగవలసిన అవసరం, రెండూ నాలో లభించాయి వెంకటేశానికి అందుకే పధ్నాలుగేళ్లు నిముషాల్లా క్షణాల్లా గడిచిపోయాయి. చెట్టంత వెంకటేశం హఠాత్తుగా చనిపోయాడు. అతనితోపాటే నా కోరికలూ చనిపోయాయి. జీవితం యింక ఎలా గడిస్తే నేం! ఎక్కడ గడిస్తే నేం? అనిపించేది. కాని ఎక్కడ గడపాలి అన్న ప్రశ్న తీవ్రంగా ఎదుర్కొన్నప్పుడు మాత్రమే నేను వధువుగా అడుగిడిన పల్లెలోని యీ పెద్ద భవంతి జ్ఞాపకంవచ్చింది. ఆయన జ్ఞాపకంవచ్చారు. ఆయనలో ఆనాడు నన్ను విసిగించిన సద్గుణాలన్నీ జ్ఞాపకంవచ్చాయి.

...దూరదేశం వదలి యీవూరు, స్టేషనులో రైలు దిగినప్పుడూ, బండి బేరమాడి ఎక్కినప్పుడూ కూడా తోచని అధైర్యం యింటిముందు బండి ఆగగానే నన్ను ఆవహిం

చింది అప్పటి పిరికితనం తల్చుకుంటే నవ్వొస్తుంది యిప్ప టికి. తలుపు తడితే—సమాధానం లేకుండానే తలుపు తెరుచుకుంది. ఆయనే తీశారు తలుపు. కొద్దిక్షణాలు గుర్తు పట్టలేదు నన్ను. అదే పెద్దలోటన్నట్లు "క్షమించు నన్ను సావిత్రీ! యిప్పట్లో నువ్వొస్తావని అనుకోలేదు" అన్నారు. కట్టలు తెగి ప్రవహించాయి నా కళ్ళనీళ్లు. ఆ యింట్లో నన్ను యింకో ప్రశ్న ఎవరూ వేయలేదు. ఎవరున్నారని వేయడానికి?

ఆయనే ఓ రోజు నా చేయి నిమురుతూ అన్నారు 'యిక్కడికి తిరిగి రావలసివచ్చినందుకు బాధపడవుకదూ - సావిత్రీ?' అని.

"లేదు, ఎప్పటికీ బాధపడను. ఇలా ఎప్పుడో నేను రావలిసిందే." అన్నాను. "అదే మంచిది. నాకెంతో సంతో షంగా వుంది" అంటూ ఆయన వెళ్ళిపోయారు. అంతే. కాలం మళ్ళా మామూలుగా గడిచిపోతూంది. యీ యింటిని పాతికేళ్ళ క్రూరావనిగా వదిలిపెట్టి పోయాను. పధ్నాల్గు సంవ త్సరాల తరవాత తిరిగి వచ్చాను...నాపోకని గుర్తించనట్లే నా రాకనీ ఎవరూ గుర్తించలేదు. యీ లోపల ఎవరి హృద యాలలో ఏవే సంఘర్షణలు జరిగితే నాకేం?

ఆయనే కాబోలు దగ్గుతున్నారు. లోపలికి పోవాలి, మందిచ్చే టైమయింది...తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది: యీ జీవితాలెంతటి మొండివి! చిరుకెరటాలతో కదలాడి పోయిన సరస్సే తృటిలో ప్రశాంతంగా అవుతుంది. గాలికి భారంగా వంగి నేలకరచిన గడ్డిపోచ అవకాశం దొరికేసరి

నిటారుగా నిలుస్తుంది. మనుషులూ అంతే, స్వర్గంలోంచి నరకంలోకి ప్రయాణించీ, దానినుండీ చెక్కు చెదరనట్లు బయట పడతారు...దానికి నిలచిన నిదర్శనలాంటిది నా జీవితం. గత దశాబ్దం నా జీవితంలో గడచినది-అంతా యిప్పుడే ప్రతిధ్వని లాగా, ప్రతిధ్వనిస్తూన్న ప్రతిధ్వనిలాగా మాత్రమే నిలచి వుంది. ఎవరి జీవితంలోనైనా అంతే-గడచిన కాలం మిగిల్చి పోయేది ప్రతిధ్వనులే!